


న్యూ మార్కెట్‌లో ఉష కొన్న సామానులన్నీ ఆరు పేకెట్లయ్యాయి. ఆమె కొనుక్కున్న కాస్మెటిక్స్ పేకెట్స్ రెండు, చీరల దుకాణంలో తయారైన పేకెట్లు మూడు, ఆపిల్స్ మూడు కిలోలు కట్టిన పెద్ద కాగితపు సంచీ ఒకటి—అన్నీ కలిపి మోసేసరికి చేతులు నెప్పులు పెడుతున్నాయి రామనాథానికి.

'ఈమె చాలా ఖర్చుమనిషి' అనుకున్నాడు మనస్సులో, బయటికి అంటే కలిగే పరిణామాలను గురించి అతనికి తెలుసును కనక. అదీకాక, కూలీని నియోజించాలన్న ఆలోచన అతనిలో కలగలేదు సకాలంలో. ఇప్పుడు ఆమె షాపింగ్ పూర్తికాబోతూంది. ఇంతసేపూ ఈ భారం వహించి చిట్టచివర ఆమెకు తన పొరపాటు తెలియజెయ్యడంలో మంచి ఏమీ కనిపించలేదతనికి.

"బరువుగా ఉన్నాయా?" అంది గ్రీటింగ్ కార్డులమ్మే షాపువైపు దారితీస్తూ.

"అబ్బే! లేదు" అన్నాడు రామనాథం, ఆమె చిరునవ్వు ఇచ్చే బలంతో 'ఇంతకన్న చాలా పెద్ద పెద్ద బరువులే ఎత్తేస్తాను' అనే అర్థం వచ్చేలాగ.

ఆమె చిరునవ్వుతో అతన్ని మరోసారి ధన్యుణ్ణి చేసి న్యూ ఇయర్ కార్డ్సు చూడడంలో నిమగ్నఅయిపోయింది.

కొద్ది క్షణాలు ఆమె అందమైన ఆకారాన్ని చూస్తూ, మరికొంతసేపు ఆమె చిరునవ్వులోని అందాలను తలుచుకునీ తను మోస్తున్న బరువు

మనుష్య ప్రవృత్తి చాలా చిత్రమైనది. ఎదుటివారికన్న తాము సంపన్నులమని, అదృష్టవంతులమని ప్రకటించుకోవాలని తాపత్రయపడడం అదొక దౌర్బల్యం. అలాంటి స్వభావం కలవారే ఇరువురూ తారసపడితే . . .

---

మరిచిపోయాడు రామనాథం. ఆ చిరునవ్వు అంటే ఎంతో సరదా అతనికి. రెండేళ్లనించి ఎన్నోసార్లు చూసినా, తనకి ఎప్పటికీ తనివితీరదు. ఆమె వయస్సుతోబాటు చిరునవ్వూ, సౌందర్యమూ ఉత్కర్ష పొందుతున్నాయి.

మరో పది నిమిషాల తరవాత ఆమె మందహాసంతో, "సారీ! పోదాం, పదండి" అనడంతో స్వప్నలోకాలనించి న్యూ మార్కెట్ దుకాణాలమధ్యకి వచ్చి, బయటికి నడిచాడు రామనాథం. అతను సామానులు బరువుగా ఉన్న సంగతి పూర్తిగా మరిచిపోయాడు.

కార్ పార్క్ దాకా ఆమె వెనకాల నడిచి ఆమె కారు తలుపు తియ్యగానే వెనకసీట్లో సామానులు చక్కగా సర్ది పెట్టి నిలబడ్డాడు. ఆమె కారు స్టార్టుచేసి, "నాతో వస్తారా?" అంది.

"థాంక్స్. నేను రాను. కొంచెం పనిఉంది" అని ఆమెవేపు చూసి చిరునవ్వునవ్వి కారు తలుపు జాగ్రత్తగా వేశాడు రామనాథం. కారు తలుపులు బాదడం అంటే ఆమెకి కోపం. ఆ సంగతి అతనికి బాగా తెలుసును.

ఆమె విలాసంగా నవ్వుతూ కారులో వెళ్ళిపోయింది. అవైపే చూస్తూ నిలబడ్డ రామనాథానికి భుజంమీద పడ్డ చెయ్యి మళ్లీ తెలివి తెప్పించింది.

తల తిప్పి చూశాడు రామనాథం. క్షణమాత్రం అతనికి ఎవరో తెలియలేదు.

"ఏనోయ్! రమణమూర్తిని ... జ్ఞాపకం లేదూ?"

"నువ్వు ... మీరు . . . రమణమూర్తి? . . ." నత్తిలాగ అన్నాడు.

"అవును. ఇద్దరం మీ ఎలమంచిలి బడిలో అయిదో ఫారం చదువుకున్నాం, జ్ఞాపకం లేదూ?"

"ఓ! ... మీరు ..."

రమణమూర్తి నవ్వాడు. "మీరేమిటోయ్! అంత గౌరవం చెయ్యకు. కలియక కలియక ఈ మహానగరంలో చిన్ననాటి స్నేహితుడివి కలిశావు. ఏం చేస్తున్నావ్?"

ఈసారి తేరిపార చూశాడు రామనాథం అతనివేపు. తెల్లటి పంట్లాం, టెరిలిన్ బుష్షర్టు, ఆరడుగుల దగ్గిర ఎత్తు, చాలా ఆరోగ్యంగా కనిపిస్తున్నాడు రమణమూర్తి. అతనికి పాతరోజులు జ్ఞాపకం వచ్చాయి. అప్పు డతను స్కూల్లో పేరుమోసిన రౌడీగా ఉండేవాడు. ఆటల్లో ఫస్టు, చదువులో లాస్టును.

"ఇక్కడే ఒక ఫర్మ్‌లో ఉంటున్నాను, ఏషియాటిక్ ట్రేడ్స్‌లో."

"ఉండడం ఎక్కడ?"

"భవానీపూర్‌లో. నువ్వు?"

రమణమూర్తి నవ్వాడు. ఎందుకో అర్థం కాలేదు రామనాథానికి.

"నేను. . . మెకంజీ కంపెనీలో పని చేస్తున్నాను. తెలుసుగా? ఫెయిర్లీ ప్లేసులో."

అత నెందుకు నవ్వాడో ఈసారి అర్థం అయింది రామనాథానికి. ఇక్కడ ఉన్న పెద్ద కంపెనీల్లో, అది చాలా ముఖ్యమైనది. క్షణమాత్రం ఈర్ష్యలాంటి భావం అతన్ని ఆవరించింది. ఈ మొద్దబ్బాయికి అంత మంచి కంపెనీలో ఉద్యోగం!

మరుక్షణం రమణమూర్తి ఆకృతి అతనికి బుద్ధి చెప్పింది. ఆ వ్యక్తిత్వంతో అతను ఏ ఉద్యోగానికైనా సరిపోతాడు. తనకు తన అయిదడుగుల అరంగుళాల ఎత్తు సిగ్గు కలగజేస్తోంది అతని పక్కన.

నిజమే, ఆ రోజుల్లోనే వాడి పెంకెతనాన్ని అంతని సహించి మాస్టారు తరుచు అనేవారు, "ఒరేయ్! వీడు పోలీసులోనో, మిలిటరీలోనో చేరితే చాలా గొప్పవాడై పోతాడురా!" అని. ఈనాడు సంపూర్ణంగా కాకపోయినా, మాస్టారు మాటలు నిజమైపోయాయి.

"వెరీ గుడ్" అన్నాడు రామనాథం చివరికి.

మళ్లీ నవ్వాడు రమణమూర్తి. హఠాత్తుగా రామనాథానికి జ్ఞాపకం వచ్చింది—స్కూల్లో, తనను తరుచు హేళన చేస్తూఉండేవాడు అతను. ఒకసారి తను ఫుట్‌బాల్ ఆడడానికి వెడితే తాను కొంచెం వరాకుగా ఉన్నప్పుడు తన వీపుకి గురిచేసి బంతి గట్టిగా తన్నాడు. బోర్లా పడి లేస్తుంటే రమణమూర్తి సరిగా ఇలాగే నవ్వాడు.

అలాగ ఎన్నోసార్లు చిన్నచిన్న విషయాల్లో తనను అతను ఏడిపిస్తూఉండేవాడు. అదీకాక రమణమూర్తి దగ్గిర ఖర్చులకు చాలా డబ్బులుండేవి. తన దగ్గిర ఉండేవికావు. ఒకనాడు—తనకు బాగా జ్ఞాపకం—తనూ రమణమూర్తీ ఏదో సినిమాకి వెళ్ళి అక్కడ కలిశారు.

ఇంటర్వెల్‌లో ఇద్దరూ బయటికి వచ్చారు. అన్నం తినకుండా వచ్చాడు తను. బాగా ఆకలి వేస్తోంది. కాని, టిక్కెట్ డబ్బులుమాత్రమే ఇచ్చి పంపింది అమ్మ. పకోడీలు కొనుక్కునేందుకు ఏమీ లేదు తన దగ్గిర. కనీసం మంచినీళ్ళు తాగితే దాహంతోబాటు ఆకలి కూడా శాంతిస్తుందని దుకాణం దగ్గిరికి వెళ్ళాడు రామనాథం. కనీసం పకోడీలైనా కొంటేగాని మంచినీళ్ళ ఇవ్వరు దుకాణంవాళ్ళు. అతనికి ఆ మాటే ఖచ్చితంగా చెప్పడంతో చిన్నబుచ్చుకుని ఇవతలికి వచ్చాడు.

అక్కడ నిలబడి జరిగినదంతా విన్న రమణమూర్తి తనను చూసి ఇలాగే నవ్వాడు, పకోడీలు కొనుక్కోడానికి వెడుతూ. ఆ తరవాత బయట నూతిదగ్గిరికి వెళ్ళి నీళ్ళు తాగాడు తాను.

ఈవేళ రమణమూర్తి నవ్వు ఇవన్నీ జ్ఞాపకం చేసింది తనకి. అతన్ని చూస్తుంటే కోపం మాత్రం రావడంలేదు, ఎందుకనో. కాని, ఈర్ష్య మళ్లీ అతన్ని బాధిస్తోంది.

"పద, కాఫీ తాగుదాం" అన్నాడు రమణమూర్తి.

అప్రయత్నంగా జేబులో చెయ్యి పెట్టుకున్నాడు రామనాథం. అతని గుండె ఝల్లుమంది. బట్టల దుకాణంలో నూరురూపాయల నోటు మార్చగా

---

## ఇచ్ఛాపురపు జగన్నాథరావు

శుద్ధమైన తేనె!

నూటికి నూరుపాళ్లు శుద్ధమైన కూర్గు తేనె 450 గ్రాములు, 225 గ్రాముల సీసాలలో లభ్యమవుతుంది. ప్రభుత్వము వారిచే అంగీకరించబడిన "ఆగ్‌మార్క్" సీలుతో, స్పెన్సర్ అండ్ కంపెనీ వారిచే ప్యాక్ చేయబడినది.

స్పెన్సర్ & కంపెనీ లిమిటెడ్
153, మౌంట్ రోడ్,
మద్రాసు-2.




Bensons 3-SCL/39R-TEL

మిగిలిన అరవై రూపాయిలూ తన జేబులో ఉన్నాయి. ఉషకు అవసరం వస్తే? ఆమెకు ఇవ్వడం మరిచి పోయాడు తాను. ఆమె తిన్నగా ఇంటికి వెళ్లిఉంటే ఫరవాలేదు కాని, మరేవైనా కొనదలుచుకుంటే?

మరుక్షణంలో అతనికి సంతోషం కలిగింది ఈ పొరపాటువల్ల. . . సామాన్యంగా అయిదారు రూపాయిల కన్న తన దగ్గర ఉంచుకునే అలవాటు లే దతనికి. కాని, ఈవేళ రమణమూర్తి దగ్గర పరాభవం జరగకూడదు. దైవాన్ని అభినందించాడు రామనాథం.

"పద."

"కారు తీసుకువెడదాం" అన్నాడు రమణమూర్తి గడియారం చూస్తూ.

రామనాథం ఎదురుగా ఉన్న టవర్‌క్లాక్ చూశాడు. ఏడు దాటుతూంది. . . ఆమె తన కోసం ఎదురు చూస్తూ ఉంటుంది.

కాని . . .

"ఏం గడియారం చూసి అలాగ అయ్యావు? భార్యగారు దెబ్బలాడతారా?" అన్నాడు లైట్‌హౌస్ సినిమావైపు దారితీస్తూ రమణమూర్తి.

"అబ్బే, అలాంటిది కాదు" అన్నాడు.

ఈసారి మందహాసంచేసి రమణమూర్తి, "అవును. అవిన్నీ చూసి అలాగే అనుకున్నాను. అద్భుతమైన అమ్మాయిని పెళ్లి చేసుకున్నావోయ్!" అన్నాడు.

తెల్లబోయి చూసి, "నువ్వెప్పుడు చూశావు?" అన్నాడు రామనాథం.

"ఇందాకా నువ్వు ఆమెను సాగనంపుతూంటే చూశాను."

**వెయ్యి మాటలు ఒక్కసారిగా వచ్చాయి రామనాథం మనస్సులో. కాని ఉషను తలుచుకోగానే అతని ముఖంలో విచిత్రమైన కాంతి వచ్చింది.**

"ఉష చాలా అద్భుతమైన అమ్మాయి" అన్నాడు చివరికి.

"ఎంత చక్కటి పేరు!"

ఆ ఆనందంలోనించి వాస్తవికతలోకి అతను వచ్చేసరికి రమణమూర్తి లైట్‌హౌస్ సినిమాకు ఎదురుగా పార్క్ చేసిన పెద్ద ఫోర్డ్ కార్ తలుపు తీసి "కూర్చో" అని అతన్ని ఆహ్వానించాడు.

"ఎంత బాగుంది నీ కారు!" అన్నాడుఅప్రయత్నంగా రామనాథం.

"ఆః కస్టమ్స్ మోడెల్. ఎక్కడికి వెడదాము?"

"ట్రింకాస్‌కి పద."

"అంతకన్న క్వాలిటీయే బాగుంటుంది."

"రెండూ అక్కడేగా! క్వాలిటీయే సరి."

ఎంతో మృదువుగా, నిశ్శబ్దంగా కారు అయిదు నిమిషాల్లో పార్క్ స్ట్రీట్ చేరుకుంది. ఇద్దరూ క్వాలిటీహోటల్లోకి నడిచారు.

విచిత్రంగా ఉంది రామనాథం పరిస్థితి. ముందర అతనికి రమణమూర్తి ఉషను చూసి పొందిన ఆశ్చర్యం ఎంతో సంతృప్తి కలగజేసింది. కాని అతని కారు చూశాక అతనికి ఆ సంతృప్తి తగ్గిపోయింది.

మెనూ జాగ్రత్తగా చూసి, బీచ్‌సాండ్విచ్, పకోడా, ఐస్‌క్రీమ్స్, కాఫీ ఆర్డరు చేశాడు రమణమూర్తి.

"చాలా అదృష్టవంతుడివి, రామనాథం! నిన్ను గురించి ఎప్పుడు తలుచుకున్నా, నీ సౌమ్యత, నీ మంచితనం జ్ఞాపకం వస్తాయి. అప్పుడే అనుకునే వాణ్ణి నువ్వు బాగా పైకి వస్తావని" అన్నాడు పకోడా తింటూ రమణమూర్తి.

"నీకన్నానా?"

"నాది ఏముందిలే, బాధ లేకుండా గడిచిపోడం తప్ప!"

మస్తుగా ఉన్నవాళ్లందరికీ ఇదే రోగం అనుకుని, "నువ్వు పెళ్లి చేసుకోలేదా?" అన్నాడు రామనాథం.

"లేదు రామనాథం. అనేక సమస్యలవల్ల..."

'అవున్లే. నీకు ప్రేమవ్యవహారాలు తక్కువ ఏమిటి?' అనుకున్నాడు రామనాథం.

"త్వరగా పెళ్లి చేసుకుంటే అవే తీరుతాయి."

"ఇలాగ అందరికీ అదృష్టం కలిసిరావద్దూ! ఉషలాటి భార్య దొరకడం చాల అదృష్టం..."

సంభాషణ ఉషమీదికి నడవడం ఇష్టంలేదు రామనాథానికి సహజంగానే. మాటలు తప్పించి, "నీ కారు చాలా గొప్పగా ఉంది, రమణమూర్తీ!" అన్నాడు.

"ప్చ్!" అన్నాడు నిర్లిప్తంగా రమణమూర్తి.

పన్నెండు రూపాయిల ఎనభైఆరు పైసలు బిల్లు వచ్చింది.

రమణమూర్తి బిల్ తీసుకోబోయాడు. కాని, పీక పోయినా అతన్ని బిల్ తీసుకోనివ్వదలుచుకోలేదు రామనాథం. బలవంతాన బిల్ తీసుకుని, రెండు పది రూపాయిలనోట్లు పడేసి చిల్లరలో ఆరుమాత్రం తీసుకుని బయటికి నడిచాడు రమణమూర్తితో.

"సిగరెట్ కావాలా?"

"పద."

**పేట్ ఎక్స్‌ప్రెస్ పేకెట్ తీసుకుని అతని కొకటి ఇచ్చి తానొకటి తీసుకున్నాడు రామనాథం.**

"పద, నిన్ను డ్రాప్ చేసి వస్తాను" అన్నాడు కారు దగ్గిరికి వస్తూ రమణమూర్తి.

కొంచెం గాభరా పడ్డాడు రామనాథం. రమణమూర్తిని ఇంటికి తీసుకువెళ్లడం అతనికి ఏమీ నచ్చలేదు— ముఖ్యంగా, ఉషమీద అతని ఉద్దేశం విన్నాక.

"ఎందుకూ?. . . నేను నడిచి వెళ్లిపోతాను. ఈ మహాపట్టణంలో నడవడం అంటే నాకు చాలా సరదా!"

రమణమూర్తి అట్టే బలవంతం చెయ్యలేదు. కారు స్టార్టు చేసుకుని, రామనాథానికి సలామ్ చెప్పి విసురుగా వెళ్లిపోయాడు.

అటే చూస్తూ కొంచెంసేపు నిలబడి నడక ప్రారంభించాడు రామనాథం. రమణమూర్తి చెప్పిన సలామ్ అతన్ని ఆకాశానికి ఎత్తేసింది. ఉషను గురించి అతను చెప్పిన మాటలూ అతన్ని ఎంతో సంతోష పెట్టాయి. ఇంతకాలం తరవాత రమణమూర్తిమీద పగ తీరింది తనకి. అతను ఏ ఆలోచనలతో తనను వదిలి వెళ్లాడో తెలిశాక, ఒక వింత సంతోషంతో అతని ఒళ్లు తేలికపడింది.

పార్క్ స్ట్రీట్‌లోనించి చౌరంగీ రోడ్‌కి వచ్చేసరికి అతని సంతోషం కొంత తగ్గింది. ఈ సాయంత్రం

## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

విఖ్యాత రచయిత, కవి, పత్రికా ప్రపంచంలో విశిష్ట స్థానం కల విద్వాన్ విశ్వం ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక సంపాదకమండలిలో చేరారని ప్రకటించుటకు ఆనందిస్తున్నాము.

వారి విశేష కృషితో ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక సర్వాంగ సుందరంగా మరిన్ని వన్నె చిన్నెలతో, వినూత్న శీర్షికలతో అత్యాకర్షకంగా వెలువడగలదని విశ్వసిస్తున్నాము.

### తల్లి నేర్పే తొలి పాఠాలు

చిత్రం—వి. రామమూర్తి (గుంటూరు-4)



గంటసేపట్లో పద్దెనిమిది రూపాయిలు ఖర్చయి పోయింది. ఆ ఖర్చు అయిన ప్రతీ పైసకీ పూర్తి విలవ తనకి రాలేదని కాదు. కాని. . .

ఉదయం వెడుతూంటే. . .

"బాబుని బడిలో వెయ్యాలి" అంది కాంతం.

"కొంచెం రోజులుండు" అన్నాడు రామనాథం.

"ఆ మాటే అంటున్నారు రెండునెలలనించి. ఇంట్లో కూర్చుని పాడౌతున్నాడు" -అంది కాంతం బాధగా.

'అవును. ఇంకో రెండునెలలు అలాగే అంటాను. ఇంకో సంవత్సరం అలాగే అంటాను' అనుకున్నాడు రామనాథం. బడిలో వెయ్యడానికి వాడికి బట్టలు కావాలి; పుస్తకాలు కొనాలి; టీచర్‌కి ఇవ్వాలి. 'ఆ డబ్బులుంటే నీకు హార్లిక్స్ కొందును; కనీసం ఒక్క మందైనా కొందును' అనుకున్నాడు రామనాథం. తన దగ్గిర ఎప్పుడూ ఉండదు డబ్బు. శేఠ్‌జీ ధర్మమా అని ఇంటర్ ఫెయిలయినా రెండువందలు దొరుకుతున్నాయి. ఈ కలకత్తాలో చావకుండా బ్రతుక్కు వస్తున్నాడు. ఏం చెయ్యగలడు?

పద్దెనిమిది రూపాయిలు!

ఎంత అవివేకం! రేపు ఉదయం పట్టుకువెళ్లి పూర్తి సొమ్ము ఇవ్వకపోతే ఉషాదేవి ఏమంటుంది? తనకంత గర్వం దేన్ని చూసుకుని? అదృష్టం కలిసి వచ్చి ఐశ్వర్యంలో తులతూగుతూన్న రమణమూర్తితో తనకు పోటీ ఏమిటి?

పి. జి. హాస్పిటల్ దగ్గిరకి వచ్చేసరికి అతను పూర్తిగా కుంగిపోయాడు. ఎంత దారుణమైన పని చేశాడు తను! తన బ్రతుక్కి నాలుగు రూపాయల సిగరెట్లేమిటి?

బరువుగా జేబులో ఉన్న సిగరెట్ పేకెట్ కాలవలోకి విసిరాడు రామనాథం. ఆ చేష్టలో అతనికి తనమీద కలిగిన అసహ్యం అంతా కేంద్రీకరించింది.

'నీఅంత అవివేకి లేడు రామనాథం! నీఅంత నీచుడు లేడు. ఏ ముఖంతో పాలిపోయిన కాంతం మాటలకు జవాబు చెబుతావు? ఏ ముఖంతో బాబును ఎత్తుకుని బుజ్జగిస్తావు? రేపు ఏం సమాధానం చెబుతావు? ఈ ఉద్యోగం ఊడితే ఏం చేస్తావు?' అని తనని తానే నిందించుకున్నాడు రామనాథం. అతనికి రమణమూర్తిమీద విపరీతమైన కోపం వచ్చింది. ఆ కోపం తన పరిస్థితిని తలుచుకున్న సిగ్గుతో ఏడుపు వచ్చేలాగ చేసింది. బరువుగా మలుపులు తిరిగి వేరన్నడులాగ, బయటికి రాని ఏడుపుతో ఇంటివేపు నడిచాడు రామనాథం. 'ఉషాదేవిని బ్రతిమిలాడాలి శేఠ్‌జీతో చెప్పవద్దని. . . అనుకున్నాడు ఇంట్లో కాలు పెడుతూ.

* * *

రమణమూర్తి గడియారం చూసుకున్నాడు. ఎనిమిదిన్నర కావస్తూంది. ఇంక సినిమా అయిపోతుంది.

కాలుస్తూన్న బీడీ పారేసి, కాకీకోటు సీటుకింద వించి తీసి తొడుక్కుని, అద్దంలో ముఖం చూసుకుని నిట్టూర్చాడు అతను. మళ్లీ వెనువెంటనే సరిపెట్టుకుని టోపీ సరిచేసుకున్నాడు.

మేమ్‌సాహెబ్ ఇంక వచ్చేస్తుంది! సినిమా వదిలేశారు!

